జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 26 | జూన్ | 2026 | పేజీలు : 5



# భద్రాచలంలో 'పల్లవి కిడ్స్' ను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

- ఘనంగా నూతన పాఠశాల ప్రారంభోత్సవం
- విద్యా ప్రమాణాలే పునాది కావాలి: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**భద్రాచలం, జూన్ 25, ప్రజాజ్యోతి:** భద్రాచలం పట్టణంలో విద్యారంగంలో కొత్త అధ్యాయానికి తెరలేచింది. జిసిసి రోడ్డులోని దేవరాజ్ హాస్పిటల్ సమీపంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన 'పల్లవి కిడ్స్ స్కూల్' గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

మిగతా 2 లో...

- మరో 'నేరేళ్ల'గా సాంబాయిగూడెం మారనుందా..?
- ఇసుక బినామీల చేతుల్లో మరెంతమంది బలికానున్నారు..?
- ఇంత జరుగుతున్నా స్పందించని అధికారులు



5 లో..

# పాలకుల నిర్లక్ష్యం... ప్రజల పాలిట శాపం..!

"యదా రాజా తదా ప్రజా" అన్నారు పెద్దలు. రాజు ఎలా ఉంటే ప్రజలు అలా ఉంటారు. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రాజు లేడు, రాజ్యం లేదు. ఉన్నదంతా ఇసుక మాఫియా రాజ్యం. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అవినీతి కలగలిసి అమాయక ప్రజల ప్రాణాలు తీస్తోంది. ఇటీవల సాంబాయిగూడెం నుండి రామానుజవరం వరకు రోడ్డును దిగ్బంధించిన ఇసుక లారీల వల్ల, పురుగుల మందు తాగిన కొమరం వంశీ(35) అనే యువకుడు ఆసుపత్రికి వెళ్లేలోపే ప్రాణాలు కోల్పోయాడు. అంబులెన్స్ కు సైతం దారి ఇవ్వని మాఫియా. భుజాలపై రోగిని మోసుకుంటూ వెళ్లిన కుటుంబం. "అరగంట ముందు తెచ్చుంటే బతికేవాడు"అన్న వైద్యుల మాటలు. ఇవన్నీ వ్యవస్థ పతనానికి నిలువెత్తు సాక్ష్యాలు. ఒకప్పుడు దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన 'నేరేళ్ల' ఘటన రాష్ట్రాన్ని కుదిపేసింది. నేడు ఇసుక లారీలతో ప్రజలను బందీలుగా చేసి, ప్రాణాలు తీస్తున్న సాంబాయిగూడెం మరో 'నేరేళ్ల'గా మారబోతోందా? ఇసుక బినామీల దాహానికి ఇంకెంతమంది బలికావాలి? స్పందించని అధికారులు, చోద్యం చూస్తున్న పాలకులు ఎప్పుడు మేల్కొంటారు? అన్న ప్రశ్నలే ఇప్పుడు పినపాక నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారాయి.

- మణుగూరు, ప్రజాజ్యోతి

# గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 25, (ప్రజాజ్యోతి)** గ్రామ స్థాయిలో ప్రజల అవసరాలు, మౌలిక సదుపాయాలు, స్థానిక సమస్యలను గుర్తించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని, గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యచందన , జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగలక్ష్మి, డి ఆర్ ఓ పద్మావతి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజా అవసరాలు, ప్రజా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తూ సమర్థవంతమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు .ఈ శిక్షణ కార్యక్రమంలో

మిగతా 2 లో...

## భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

- స్వామి వారిని దర్శించుకున్న గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్



**భద్రాచలం టౌన్ , జూన్ 25 ప్రజాజ్యోతి**
భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అలాగే స్వామి వారిని గిరిజన సంక్షేమ శాఖ హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్, రాంబాబు, అర్చక స్వాములు పాల్గొన్నారు



సమాజాన్ని, ముఖ్యంగా యువతను నాశనం చేస్తున్న మత్తు పదార్థాలపై ఇల్లందు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇల్లందు పట్టణంలో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, షాపులు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతున్నారు.

- ఇల్లందు, ప్రజాజ్యోతి



2 లో..

# మత్తు పదార్థాలపై... ఖాకీల కన్నెర్ర..!

- ఎస్పీ ఆదేశాలతో ఇల్లందులో ముమ్మర తనిఖీలు
- ప్రతి షాపును క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పోలీసులు
- రంగంలోకి దిగిన నార్కోటిక్ డాగ్
- మత్తు పదార్థాలను నివారించడమే ఖాకీల లక్ష్యం
- మత్తుకు బానిసైతే జీవితం అంధకారమే
- మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం
- బంగారు భవిష్యత్తుకు బాటలు పడాలి
- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు సూచనలు

# భద్రాచలంలో 'పల్లవి కిడ్స్' ను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం.వెంకట్రావు



(మొదటి పేజీ తరువాయి... )

భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, భద్రాచలం దేవస్థానం ఏఈఓ శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు.

**విద్యే సమాజ నిర్మాణానికి పునాది...**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, బాల్య దశలో అందించే నాణ్యమైన విద్యే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతుందన్నారు. కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండా, చిన్నారులలో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందించేలా విద్యాసంస్థలు కృషి చేయాలని ఆయన సూచించారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలని, క్రీడలు, కళా రంగాల్లోనూ వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

**విలువల కూడిన విద్య అవసరం...**

సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల చిన్నారులకు సంస్కారం, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం అభినందనీయమన్నారు. దేవస్థానం ఏఈఓ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే పిల్లల్లో నైతిక విలువలు, ఆధ్యాత్మిక చింతన, దేశభక్తిని పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు.

**అత్యాధునిక సదుపాయాల పరిశీలన...**

ప్రారంభోత్సవం అనంతరం అతిథులు పాఠశాల తరగతి గదులు, స్మార్ట్ లెర్నింగ్ సదుపాయాలు, సృజనాత్మక అభ్యాస కేంద్రాలను పరిశీలించారు. పాఠశాల యాజమాన్యం రూపొందించిన బోధనా విధానాలు, విద్యా ప్రణాళికలను చూసి వారు సంతృప్తి వ్యక్తం చేశారు. యాజమాన్యం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల మేధో వికాసానికి ఎంతగానో దోహదపడతాయని విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం వీరరాపు వెంకట సంపూర్ణ రావు బొప్పిడి పూజ, కవిటాపు రమేష్ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు. చివరగా అతిథులను యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

# గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి



(మొదటి పేజీ తరువాయి... )

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పంచాయతీ అడ్వాన్స్ ఇండికేటర్స్ , పీఏఐ సూచికలను జీపీడీపీతో అనుసంధానం చేయడం ద్వారా నాణ్యమైన గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించే విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు, పెసా గ్రామ పంచాయతీలు, సభాసర్, నిర్ణయ్ యాప్, ఈ–గ్రామ స్వరాజ్ పోర్టల్ వినియోగంపై వివరించారు.గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీలు ఉత్తమ పనితీరు కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు.ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విద్యచందన, పంచాయతీ కార్యదర్శి ఎం. సాయి, ఎంపీడీఓ సంకీర్త్, ఎంపీఓ వీరారెడ్డి, ఎంపీఓ సంధ్య శిక్షకులుగా పాల్గొని వివిధ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమం లో సంబంధిత జిల్లా అధికారులు, కొత్తగూడెం, భద్రాచలం డివిజన్ల డీఎల్ పీఓలు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు , సిబ్బంది పాల్గొన్నారు.





# మత్తు పదార్థాలపై... ఖాకీల కన్నెర్ర..!

సమాజాన్ని, ముఖ్యంగా యువతను నాశనం చేస్తున్న మత్తు పదార్థాలపై ఇల్లందు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇల్లందు పట్టణంలో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, షాపులు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతున్నారు.

● ఇల్లందు, ప్రజాజ్యోతి

- ఎస్పీ ఆదేశాలతో ఇల్లందులో ముమ్మర తనిఖీలు
- ప్రతి షాపును క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పోలీసులు
- రంగంలోకి దిగిన నార్కోటిక్ డాగ్
- మత్తు పదార్థాలను నివారించడమే ఖాకీల లక్ష్యం
- మత్తుకు బానిసైతే జీవితం అంధకారమే
- మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం
- బంగారు భవిష్యత్తుకు బాటలు పడాలి
- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు సూచనలు

### ››› రంగంలోకి నార్కోటిక్ డాగ్ ...

మత్తు పదార్థాలను గుర్తించేందుకు ప్రత్యేకంగా నార్కోటిక్ డాగ్ ను రంగంలోకి దింపారు. పోలీసు బృందాలతో కలిసి డాగ్ స్క్వాడ్ పలు షాపులు, గోదాములు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది. అక్రమంగా దాచి విక్రయించే గంజాయి, మాదక ద్రవ్యాలు, ఇతర నిషేధిత పదార్థాలను గుర్తించేందుకు ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అక్రమంగా మత్తు పదార్థాల వ్యాపారం నిర్వహించే వారిని ఉపేక్షించేది లేదని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.

### ››› యువతే ప్రధాన లక్ష్యం ....

మత్తు పదార్థాల వ్యాపారులు ముఖ్యంగా యువతనే లక్ష్యంగా చేసుకుని తమ వల విసురుతున్నారని పోలీసులు చెబుతున్నారు. స్నేహితుల ఒత్తిడి, తాత్కాలిక ఆనందం, సరదా పేరుతో మొదలయ్యే అలవాటు చివరికి జీవితాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందని హెచ్చరిస్తున్నారు. ఒకసారి మత్తుకు బానిసైతే విద్య, ఉద్యోగం, కుటుంబ బంధాలు, ఆరోగ్యం అన్నీ దెబ్బతింటాయని అవగాహన కల్పిస్తున్నారు.

### ››› తల్లిదండ్రుల అప్రమత్తత తప్పనిసరి ....

పిల్లల ప్రవర్తనలో మార్పులు, అనవసర ఖర్చులు, చదువుపై ఆసక్తి తగ్గడం వంటి అంశాలను తల్లిదండ్రులు గమనించాలని పోలీసులు సూచిస్తున్నారు. యువత ఎవరితో తిరుగుతున్నారని ఎలాంటి అలవాట్లు పెంచుకుంటున్నారనే విషయాలపై కుటుంబ సభ్యులు దృష్టి పెట్టాలని చెబుతున్నారు. మత్తు పదార్థాల బారిన పడిన వారిని శిక్షించడమే కాకుండా వారికి సరైన కౌన్సిలింగ్ అందించి తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం కూడా అవసరమని అభిప్రాయపడుతున్నారు.

### ››› ప్రజల సహకారమే కీలకం ....

మత్తు పదార్థాల నిర్మూలనలో పోలీసులతో పాటు ప్రజల పాత్ర కూడా ఎంతో ముఖ్యమని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నా, యువతను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇస్తున్నారు.

### ››› బంగారు భవిష్యత్తుకు బాటలు పడాలి ....

నేటి యువతే రేపటి భారత నిర్మాణకర్తలని, వారి భవిష్యత్తు చీకటిలోకి వెళ్లకుండా కాపాడడం అందరి బాధ్యత అని పోలీసులు పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, ఉపాధి, సామాజిక సేవా కార్యక్రమాల వైపు యువత అడుగులు వేయాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి మత్తు రహిత జీవనమే సరైన మార్గమని తెలిపారు.

## మత్తు పదార్థాల వల్ల జీవితం అంధకారం


**యు వెంకన్న బాబు, డిఎస్పి, ఇల్లందు**



మత్తు పదార్థాల వల్ల యువత, ప్రజల జీవితం అంధకారమవుతుంది. ముఖ్యంగా యువత సరదాల కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. చదువుపై శ్రద్ధ పెట్టి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించేందుకు కృషి చేయాలి. యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తపిస్తున్న తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేయొద్దు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి. మత్తు పదార్థాలకు బానిస అయితే భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం లేకపోలేదు. అంతేకాకుండా ఎక్కడైనా మత్తు పదార్థాలు సేవించడం, విక్రయాలు జరపడం, రవాణా జరుగుతున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలి.

# భద్రతకు బీటలు... మూగబోయిన సీసీ కెమెరాలు

- నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పాడై నిరుపయోగం
- మరమ్మతుల లేమితో నిర్వీర్యమైన నిఘా వ్యవస్థ



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 25 (ప్రజా జ్యోతి):**

అన్నపురెడ్డిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నాలుగేళ్ల క్రితం ప్రజాప్రతినిధులు, వ్యాపారుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రస్తుతం పనిచేయక నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో నేరాల నియంత్రణతో పాటు భద్రతా పర్యవేక్షణను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలు మరమ్మతుల లేమితో అలంకారప్రాయంగా మిగిలిపోయాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థకు కాలానుగుణంగా నిర్వహణ చేపట్టకపోవడంతో పలు గ్రామాల్లోని సీసీ కెమెరాలు ఒక్కొక్కటిగా పనిచేయడం నిలిచిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, ప్రజా రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలు పనిచేయకపోవడంతో భద్రతాపరమైన పర్యవేక్షణ బలహీనపడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో చోరీలు, ఇతర అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు ఆధారాలను గుర్తించడం కష్టంగా మారే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు పేర్కొంటున్నారు. నేరాల నియంత్రణలో కీలకంగా ఉపయోగపడాల్సిన సీసీ కెమెరాలు ప్రస్తుతం పేరుకే మిగిలిపోయాయని విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాడైన సీసీ కెమెరాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా నిర్వహణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎర్రగుంట ప్రభుత్వ ఆసుపత్రిలో నీటి కష్టాలు

- రోగులకు తప్పని ఇబ్బందులు
- నెలలుగా తాగునీరు, మరుగుదొడ్లలో నీటి కొరత
- తక్షణ చర్యలు చేపట్టాలని రోగుల విజ్ఞప్తి





**అన్నపురెడ్డిపల్లి, జూన్ 25 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలలుగా కొనసాగుతున్న నీటి సమస్య రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. చికిత్స కోసం వచ్చే వారికి కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడంతో పాటు మరుగుదొడ్లలో సైతం నీటి సౌకర్యం లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఇలాంటి పరిస్థితులు ఉండడం పట్ల రోగులు, వారి కుటుంబ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ 100 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్న ఈ ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక అవసరమైన తాగునీటి సదుపాయం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. వైద్యులు ఎక్కువగా నీరు తాగాలని సూచిస్తుంటే, ఆసుపత్రిలోనే తాగునీరు అందుబాటులో లేకపోవడం విచారకరమని రోగులు వాపోతున్నారు.ఆసుపత్రికి సమీపంలోనే గ్రామ తాగునీటి పైప్‌లైన్ ఉన్నప్పటికీ, అక్కడి నుంచి ఆసుపత్రి నీటి ట్యాంకుకు ప్రత్యేక కనెక్షన్ కల్పించకపోవడంతో సమస్య కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. సుమారు మూడు వంతుల కిలోమీటరు దూరంలో ఉన్న పైప్‌లైన్ నుంచి ఆసుపత్రికి నీటి కనెక్షన్ కల్పిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. మండలంలోని ఏకైక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉత్తమ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండి కూడా ఇలాంటి సమస్య నెలకొనడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణకు నిధులు వస్తున్నాయా? వస్తే వాటిని ఏ పనులకు వినియోగిస్తున్నారు? అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.ఇదే సమస్యపై ఇటీవల బీజేపీ నాయకుడు బాల కిరణ్ స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణను వ్యక్తిగతంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న నీటి సమస్యను అత్యవసరంగా పరిష్కరించి, రోగులకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన ఎమ్మెల్యేను కోరినట్లు తెలిసింది.ఈ విషయంపై వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌ను వివరణ కోరగా, గతంలో ఇక్కడ పనిచేసిన వైద్యులు ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారని తెలిపారు. తాను కూడా మరోసారి సంబంధిత అధికారులకు సమస్యను గుర్తు చేసి, వీలైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

# విద్యుత్ విషాదం.....ఒక ప్రాణం తీసి మరో ప్రాణాన్నీ బలిగొంది





**టేకులపల్లి,జూన్25,ప్రజాజ్యోతి:** మండలంలోని బోడు గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటన గ్రామస్తులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బుధవారం విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన ఘటన మరుసటి రోజే అదే చేనులో మరో వ్యక్తి ఆత్మహత్యకు దారితీయడం గ్రామంలో విషాద ఛాయలు అలుముకునేలా చేసిం ది.బోడు గ్రామ పంచాయతీ సర్పంచ్ పోదేం స్వరూప అత్త పొదెం చుక్కమ్మ (55) బుధవారం మొక్కంపాడు గ్రామ సమీపంలోని ఓ పత్తి చేనులో కూలి పనులకు వెళ్లారు. ఈ క్రమంలో చేనుకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ దాటే ప్రయత్నంలో విద్యుత్ ప్రవహిస్తున్న తీగ తగలడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. తోటి కూలీలు వెంటనే ఆమెను కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆమె మృతి చెందారు. అయితే ఈ ఘటన వెనుక ఉన్న పరిస్థితులు గ్రామంలో మరింత విషాదానికి కారణమయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం...బోడు గ్రామానికి చెందిన మాడె పాపయ్య చేనులో ఫెన్సింగ్ కి విద్యుత్ సరఫరా కావడంతో.... అదే విద్యుత్ ఫెన్సింగ్ వైర్‌కు విద్యుత్ ప్రవహించి చుక్కమ్మ మృతి చెందడంతో.... ఈ ఘటనలో తనపై కేసు నమోదవుతుందనే భయంతో, తీవ్ర మనస్తాపానికి గురైన మాడె పాపయ్య గురువారం చేనులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయితే పాపయ్య మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఒక కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చిన విద్యుత్ ప్రమాదం, మరో కుటుంబంలోనూ విషాదాన్ని నింపడం స్థానికులను కలచివేసింది.

# పోడు భూముల్లో జోక్యాన్ని అడ్డుకోవాలి

- పాయం సత్యనారాయణ



**చర్ల, జూన్ 25 (ప్రజా జ్యోతి ):** పెదముసిలేరు అటవీ ప్రాంతంలోని నారాయణమూర్తిగడ్డ పోడు భూముల్లో బోటుగూడెం గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్లతో దుక్కి దున్నడం సరికాదని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. ఈ విషయమై గురువారం చర్ల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పెదముసిలేరు కంపార్ట్‌మెంట్–65 పరిధిలో గత ఆరు నుంచి ఏడు సంవత్సరాలుగా సున్నంగుంపు గ్రామానికి చెందిన 55 మంది ఆదివాసీ కుటుంబాలు ఉమ్మడి పోడు భూములను పంచుకుని సాగు చేసుకుంటున్నారని ఆ భూములతో ఎలాంటి సంబంధం లేని బోటుగూడెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గత కొన్ని రోజులుగా ట్రాక్టర్లతో దుక్కి దున్నుతూ ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆరోపించారు.నారాయణమూర్తిగడ్డ పోడు భూముల హక్కుల కోసం గతంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సున్నంగుంపు ఆదివాసీలు భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద 169 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహించి తమ హక్కులను సాధించుకున్నారని గుర్తు చేశారు.పోరాటాల ద్వారా సాగులోకి వచ్చిన భూముల్లో తిరిగి ఇతర గ్రామాల వ్యక్తులు జోక్యం చేసుకోవడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. బోటుగూడెం గ్రామస్తులకు వారి సొంత భూములు ఉన్నప్పటికీ దురుద్దేశపూర్వకంగానే పోడు భూముల్లోకి ప్రవేశిస్తున్నారని ఆరోపించారు.ఈ అంశంపై అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటే పోడు భూముల్లో శాంతియుతంగా వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాక శీను, ఇర్ప ప్రకాష్, కొమరం వెంకటరమణ, సున్నం కళావతి, మడివి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# పోలియో చుక్కలతో పిల్లలకు రక్షణ

- మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక





**చర్ల, జూన్ 25(ప్రజా జ్యోతి ):** పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజలు, ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక పిలుపునిచ్చారు. పల్స్ పోలియో బూత్ కోఆర్డినేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.పోలియో వైరస్ కారణంగా పిల్లల్లో శాశ్వత వికలాంగత్వం ఏర్పడే ప్రమాదం ఉందని భారతదేశం పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ అప్రమత్తత కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. పొరుగు దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో నివారణ చర్యలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు.కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 32 గ్రామాల్లో ఈ నెల 28న పల్స్ పోలియో కార్యక్రమం చేపట్టనున్నట్లు అన్నారు . గ్రామాల్లో ప్రత్యేక పోలియో కేంద్రాలతో పాటు బస్టాండ్లు, సంతలు, రద్దీ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు సమిష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లల ను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని వి జ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు





**చర్ల, జూన్ 25: (ప్రజా జ్యోతి ):** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురుదేవ్ విద్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ కేశవ విద్యార్థులను ఉద్దేశించి మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు ప్రయాణాల్లో సీట్‌బెల్ట్ వినియోగం ప్రాణాలను కాపాడగలదని ఆయన అన్నారు .మైనర్ విద్యార్థులు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమేకాక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదకర వ్యసనాలని పేర్కొంటూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా వాటికి దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించి, పోలీసు సహాయం కోసం 100, అత్యవసర సేవల కోసం 112, బాలల రక్షణ కోసం 1098 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, రోడ్డు భద్రతపై విలువైన సందేశాన్ని అందించిన ఎస్ఐ కేశవకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్.జి.వి. ప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్లు ఎం.వి. సుబ్రహ్మణ్యం, జి. శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ను సద్వినియోగం చేసుకోవాలి: వైస్ చైర్మన్



**ఇల్లందు, జూన్ 25 (ప్రజా జ్యోతి )** ఓటరు సవరణ సర్ ప్రక్రియను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఇల్లందు మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు కోరారు. గురువారం 17వ వార్డులో ఓటర్ సవరణ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ తో ప్రతి ఒక్కరు తమ ఓటుకు సంబంధించిన పూర్తి వివరాలను సమగ్రంగా సమీక్షించుకోవచ్చని ఏవైనా తప్పులు ఉంటే సరిచేసుకోవాలని ఈ సదవకాశాన్ని ప్రజలంతా ఉపయోగించుకోవాలని తెలిపారు. సర్ ను నిర్లక్ష్యం చేస్తే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా ప్రతి ఒక్కరు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ నాగమణి, కాంగ్రెస్ నాయకులు జియా, ఖాదర్ మల్లయ్య, రఫీ, ప్రజలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ సర్వే ప్రారంభం

- **నిర్లక్ష్యం చేస్తే ఓటు గల్లంతు**
- **కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్**



**ఇల్లందు, జూన్ 25 (ప్రజా జ్యోతి )** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఇంటింటి సర్వే ప్రక్రియ ప్రారంభమైందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ పేర్కొన్నారు. గురువారం 22వ వార్డులో జరిగిన ఓటర్ల జాబితా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు నేటి నుండి నెల రోజులపాటు ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. సర్వేకు వచ్చే అధికారులు ప్రతి ఓటర్ కు రెండు ఇన్యూమరేషన్ ఫారాలను అందిస్తారని, వాటిలో వివరాలను నింపి ఒక ఫారాన్ని వారికి ఇచ్చి మరొకటి ఓటర్లు తమ వద్ద భద్రపరచుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2002 ఓటర్ల జాబితాను ఆధారంగా చేసుకుని ప్రస్తుత ఓటర్లతో మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నార న్నారు. సర్వేను నిర్లక్ష్యం చేస్తే ఓటు తొలగిపోయే అవకాశం ఉందని, దాని వల్ల భవిష్యత్తులో రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సంక్షేమ పథకాలకు ఇబ్బంది కలుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ బాలరాజు, వార్డు ఆఫీసర్ రజిని, అంగన్వాడి టీచర్ అజ్మీర సక్కుబాయి, బిఎల్ఏ లు కోలపురి ఝాన్సీ, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటర్ జాబితా కోసం ప్రత్యేక సమగ్ర సవరణ

- **భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట**



**భద్రాచలం టౌన్, జూన్ 25, ప్రజాజ్యోతి** పారదర్శక ఓటర్ జాబితా కోసం ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో సంబంధిత ఓటర్లు బి ఎల్ ఓ లు అందించిన ఎన్యుమరేషన్ పారాలలో పూర్తిస్థాయి వివరాలు పొందుపరిచి తిరిగి బిఎల్ఓ లకు అందించి రసీదు పొందాలని భద్రాచలం సబ్ కలెక్టర్, భద్రాచలం నియోజకవర్గం ఈఆర్ఓ మృనాల్ శ్రేష్ట ఓటర్లకు సూచించారు. గురువారం భద్రాచలంలోని అయ్యప్ప కాలనీలోని 158వ పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లకు ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు అందించి ఓటర్లకు సూచనలు, సలహాలు ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఈరోజు నుండి ప్రారంభమైనందన్నారు. బిఎల్ఓ, బిఎల్ఏలు వారి పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు అందించినప్పుడు తప్పనిసరిగా సంబంధిత ఇంటి యజమాని కుటుంబ సభ్యుల వివరాలు, అర్హులైన వారికి ఓటర్ నమోదు చేయించాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారం పూరించేటప్పుడు ఓటర్లు తప్పనిసరిగా ఓటర్ ఐడి కార్డ్, ఆధార్ కార్డ్, మొబైల్ నెంబర్ తప్పనిసరిగా తెలిసి ఉండాలని, బిఎల్వోలు అవసరమైతే అడిగే పత్రాలు జనన ధ్రువీకరణ పత్రం, చదువుకున్న వారు పదవ తరగతి మెమో, పాస్పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, రేషన్ కార్డ్, విద్యుత్ బిల్లు లేదా గ్యాస్ బిల్లు, బ్యాంకు పాస్బుక్, ఇంటి లేదా భూమి పత్రాలు, ప్రభుత్వ ఉద్యోగి ఐడి లేదా పెన్షన్ పేమెంట్ ఆర్డర్ అందించి మీ పేరు, తల్లిదండ్రుల పేరు, వయసు చిరునామా సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని, కుటుంబంలోని అందరి సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారించు కొని సక్రమంగా పూరించి తిరిగి బిఎల్ఓ లకి అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నయాబ్ తహసిల్దార్ శ్రీమతి వినయ్ శీల శ్రీరామ్, బిఎల్ఓ రమేష్, సూపర్వైజర్ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్వోలు ,సూపర్వైజర్లు అర్హులైన ఓటర్లను గుర్తించి తప్పనిసరిగా నమోదు చేయాలి

- **భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వెల్లడి**



**భద్రాచలం టౌన్, జూన్ 25, ప్రజాజ్యోతి,** ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను సంబంధిత బిఎల్వోలు, సూపర్వైజర్లు అర్హులైన ఓటర్లను గుర్తించి తప్పనిసరిగా నమోదు చేయాలని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా భద్రాచలంలోని అశోక్ నగర్ కాలనీలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 167 పరిధిలో ఉన్న తన క్యాంపు కార్యాలయానికి ఎన్యుమరేషన్ ఫారం అందించడానికి వచ్చిన తహసీల్దారు, బిఎల్ఓ ద్వారా ఎన్యుమరేషన్ ఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బి ఎల్ ఓ, సూపర్వైజర్లకు పలు సూచనలు ఇస్తూ ఎన్యుమరేషన్ ఫారంలో ఓటర్ల యొక్క వివరాలు పొందుపరిచేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఓటర్లను పూర్తిస్థాయిలో వివరాలు అడిగిన తర్వాతనే ఎన్యుమరేషన్ ఫారంలో పొందుపరచాలని అన్నారు. అనంతరం భద్రాచలం తహసీల్దారు, బిఎల్వోలు సూపర్వైజర్లు ఎస్ ఆర్ ఎన్ కాలనీలోని 172 పోలింగ్ స్టేషన్ పరిధిలోకి వచ్చే అటవీ అభివృద్ధి శాఖ చైర్మన్ పోదెం వీరయ్య కుటుంబ సభ్యులకు ఎన్యుమరేషన్ పారములు అందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తహసిల్దార్ కోటా రవికుమార్, బిఎల్వోలు రాజేశ్వరి, మంగమ్మ, సూపర్వైజర్లు వరలక్ష్మి , కీర్తి పాల్గొన్నారు.

## అంగన్వాడి హెల్పర్లకు ప్రమోషన్లు, టీచర్లకు ట్రాన్స్ఫర్స్ లేక అష్టకష్టాలు

- **ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్న "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లుగా ఉంది.**



**అశ్వాపురం, జూన్ 25, ప్రజాజ్యోతి** జిల్లాలో అర్హత కలిగిన అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లుగా ప్రమోషన్, ఇవ్వాల్సి ఉన్నప్పటికీ దమ్మపేట మణుగూరు ఇల్లందు ప్రాజెక్టు పరిధిలో పలువురు అంగన్వాడి హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వకుండా ఖాళీలను నింపేందుకు అధికారులు భర్తీ చేయడం ద్వారా అర్హులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ పేర్కొన్నది. అర్హత ఉండి బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న అంగన్వాడీ టీచర్లకు బదిలీలు చేయకుండా బాధ్యత రాహిత్యంగా అధికారులు వ్యవహరిస్తూ జిల్లాలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని దీని వెనక లక్షల రూపాయల చేతులు మారుతున్నట్టుగా ఆరోపణలు వస్తున్నాయని సిఐటియు అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పేర్కొన్నది. అర్హత కలిగిన హెల్పర్లు టీచర్ ప్రమోషన్ కోసం నిబంధనల ప్రకారం దరఖాస్తు పెట్టుకున్నప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోకుండా సిడిపివోలు జిల్లా డిడబ్ల్యూ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రమోషన్ రాకుండా వారికి అన్యాయం చేస్తున్నారని సి ఐ టి యు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈసం వెంకటమ్మ జి పద్మ తెలిపారు.ఐసిడిఎస్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా జిల్లాలో డీ డబ్ల్యూ తో పాటు మణుగూరు దమ్మపేట ఇల్లందు సిడిపివోలు వ్యవహరిస్తున్నారని తెలిపారు.దమ్మపేట ప్రాజెక్టులోని రావి కొయ్యల పాడు కేంద్రంలోని హెల్పర్ ఫిబ్రవరి నెలలోనే మొండివర్రె అనే కేంద్రానికి టీచర్ ప్రమోషన్ కోసం దరఖాస్తు చేసుకుందని అయినప్పటికీ ఇప్పటికీ 15 సార్లు డీ డబ్ల్యూ కార్యాలయంలో సిడిపిఓ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించినప్పటికీ నిబంధనల ప్రకారం హెల్పర్ నుండి టీచర్ ప్రమోషన్ రావాల్సి ఉండగా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారు. ప్రమోషన్ కల్పించమని అశ్వారావుపేట ఎమ్మెల్యే సైతం లేఖ రాసినప్పటికీ ఆ లేఖను సైతం అధికారులు పట్టించుకోకుండా సదరు హెల్పర్ ప్రమోషన్ ను అడ్డుకుంటున్నారని సిఐటియు పేర్కొన్నది.అదే విధంగా మణుగూరు ప్రాజెక్టులో శారద అనే హెల్పర్ ప్రమోషన్ కోసం దరఖాస్తు పెట్టుకోగా ప్రమోషన్ దరఖాస్తు తిరస్కరించారని ఎందుకు తిరస్కరించారు.అని అడిగితే దానికి సరైన కారణం కూడా చెప్పటం లేదని కనీసం పక్క సెంటర్ కి బదిలీ అయిన చేయండి అని దరఖాస్తు పెట్టుకున్న బదిలీ దరఖాస్తును కూడా ఏకపక్షంగా తిరస్కరించి అన్యాయం చేస్తున్నారని ఇదే తరహాలో మణుగూరు ప్రాజెక్టులో ముగ్గురు ఇల్లందు ప్రాజెక్టులో మరికొందరు ఉన్నారని వీరందరికీ న్యాయబద్ధంగా రావలసిన ప్రమోషన్లు బదిలీలను ఇవ్వకపోతే ప్రత్యక్షంగా ధర్నా చేస్తామని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ప్రకటించింది.ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రాకముందే వీరికి న్యాయం చేయాలని లేదంటే అన్యాయం జరిగిన బాధితులు న్యాయ ప్రక్రియను ఆశ్రయిస్తే మొత్తం ఖాళీల భర్తీ మీదనే ప్రతికూల ప్రభావం చూపుతోందని,అలా జరిగితే జిల్లాలోని డి డబ్ల్యు ఓ మరియు సిడిపిఓలే బాధ్యత వహించవలసి ఉంటుందని,సిఐటియు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ భద్రాద్రి జిల్లా కమిటీ తెలిపింది తక్షణం బాధితులకు అన్యాయం జరగకుండా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## రైతాంగ సమస్యలపై 29న ధర్నా జయప్రదం చేయాలి

- **ఏఐకేఎంఎస్ కరపత్రాల ఆవిష్కరణ**



**టేకులపల్లి,జూన్ 25,ప్రజాజ్యోతి:** రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు పిలుపునిచ్చారు.గురువారం టేకులపల్లిలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్తీ వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు, ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుగులోత్ రామచంద్, భూక్య హర్జ్య మాట్లాడుతూ రైతులపై పెరుగుతున్న భారం తగ్గించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేసిన మొక్కజొన్న పంటకు సంబంధించిన చెల్లింపులు రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే యూరియా తదితర ఎరువులను మొబైల్ యాప్ ద్వారా కొనుగోలు చేసే విధానం రైతులకు అనేక సమస్యలను సృష్టిస్తోందని, ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు.రైతులకు అవసరమైన ఎరువులు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో టేకులపల్లి మండలంలో పెద్ద ఎత్తున రైతాంగ ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల నాయకులు భూక్య నర్సింగ్, ఆంగోతు బాలు, బానోత్ వెంకట్రాం, ధరావత్ బిక్యా, ధరావత్ వెంకన్న, భూక్య రామకోటి, అనంతోజు చంద్రచారి, లింబ తదితరులు పాల్గొన్నారు.

- మరో 'నేరెళ్ల'గా సాంబాయిగూడెం మారనుందా..?
- ఇసుక బినామీల చేతుల్లో మరెంతమంది బలికానున్నారు..?
- ఇంత జరుగుతున్నా స్పందించని అధికారులు



# పాలకుల నిర్లక్ష్యం... ప్రజల పాలిట శాపం..!

"యదా రాజా తదా ప్రజా" అన్నారు పెద్దలు. రాజు ఎలా ఉంటే ప్రజలు అలా ఉంటారు. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రాజు లేడు, రాజ్యం లేదు. ఉన్నదంతా ఇసుక మాఫియా రాజ్యం. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అవినీతి కలగలిసి అమాయక ప్రజల ప్రాణాలు తీస్తోంది. ఇటీవల సాంబాయిగూడెం నుండి రామానుజవరం వరకు రోడ్డును దిగ్బంధించిన ఇసుక లారీల వల్ల, పురుగుల మందు తాగిన కొమరం వంశీ(35) అనే యువకుడు ఆసుపత్రికి వెళ్లేలోపే ప్రాణాలు కోల్పోయాడు. అంబులెన్స్ కు సైతం దారి ఇవ్వని మాఫియా. భుజాలపై రోగిని మోసుకుంటూ వెళ్లిన కుటుంబం. "అరగంట ముందు తెచ్చుంటే బతికేవాడు"అన్న వైద్యుల మాటలు. ఇవన్నీ వ్యవస్థ పతనానికి నిలువెత్తు సాక్ష్యాలు. ఒకప్పుడు దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన 'నేరెళ్ల' ఘటన రాష్ట్రాన్ని కుదిపేసింది. నేడు ఇసుక లారీలతో ప్రజలను బందీలుగా చేసి, ప్రాణాలు తీస్తున్న సాంబాయిగూడెం మరో 'నేరెళ్ల'గా మారబోతోందా? ఇసుక బినామీల దాహానికి ఇంకెంతమంది బలికావాలి? స్పందించని అధికారులు, చోద్యం చూస్తున్న పాలకులు ఎప్పుడు మేల్కొంటారు? అన్న ప్రశ్నలే ఇప్పుడు పినపాక నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారాయి.

**మణుగూరు, ప్రజాజ్యోతి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం పరిధిలోని ఇసుక రీచుల బినామీ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా లారీలను ప్రధాన రహదారిపై నిలిపివేయడంతో అంబులెన్స్ కు కూడా దారి ఇవ్వని దుస్థితి కనిపిస్తుంది. గత నాలుగు రోజుల క్రితం సాంబాయిగూడెం ఇసుక ర్యాంపు పరిధిలో ప్రధాన రహదారిలో వందల లారీలు క్యూ కట్టడంతో బయ్యారం నుండి వస్తున్నటువంటి అంబులెన్స్ కు దారి ఇవ్వక అందులో ఉన్న కొమరం వంశీ అనే వ్యక్తి సకాలంలో హాస్పిటల్ కు చేరకపోవడం వలన మృతి చెందడం జరిగింది. నేటి వరకు వంశీ కుటుంబాన్ని అధికార యంత్రాంగం, పాలకులు పరామర్శించిన దాఖలాలు లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే ప్రధాన రహదారిపై ఇసుక లారీల వలన అనేకమంది మరణించిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ధనార్జనే తప్ప ప్రజల ప్రాణాలను లెక్కచేయని ఇసుకాసురులకు అధికార యంత్రాంగం అండగా నిలుస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ప్రజల ప్రాణాలు ముఖ్యమా... లేక బినామీల ధనార్జనే ముఖ్యమా... అధికార యంత్రాంగం, పాలకులు తేల్చాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికార యంత్రాంగం, పాలకుల్లారా ఆ గట్టునుంటారా... ఈ గట్టునుంటారా మీరే త్వరగా తేల్చుకోవాలని లేనిపక్షంలో ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని ఆదివాసీలు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్ర వాదులు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు.

## 'యదా రాజా తదా ప్రజా' – నిర్లక్ష్యానికి పరాకాష్ట

ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులు. వారి సేవకులే అధికారులు, పాలకులు. కానీ సాంబాయిగూడెంలో ఇసుక బినామీలే రాజులు. అధికారులే వారి సేవకులు అన్న చందంగా ఉంది. ప్రజలు మాత్రం బానిసలుగానే ఉన్నారు. నిబంధనలు ప్రకారం ప్రతి రీచ్ కు 2 ఎకరాల పార్కింగ్ స్థలం ఉండాలి. కానీ సాంబాయిగూడెం, రామానుజవరం, విజయనగరం ర్యాంపులకు పార్కింగ్ స్థలాలు లేవు. దాని కారణంగా ఇసుక లోడింగ్ కు వచ్చిన లారీలను ప్రధాన రహదారిలో నిలిపివేయడంతో అనేక ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. అనుమతులు ఇచ్చిన 'రాజు' ఎవరు? మైనింగ్ ఏడీ, ఆర్డీఓ కాదా? అంబులెన్స్ కు దారి ఇవ్వాలి. ఇవ్వకపోతే 6 నెలలు జైలు శిక్ష పడుతుంది అనే విషయం అధికారులకు తెలియదా అని ప్రజలు ఆరోపిస్తున్నారు. వంశీ ప్రాణం పోవడానికి కారణం ఇసుక రీచ్ ల యజమానులు కాదా అంటూ ఆదివాసీలు మండిపడుతున్నారు. ఒక్కరిపైనా కేసు లేదు. చట్టమే చుట్టమైనట్టుగా ఇసుక ర్యాంపుల నిర్వాహకులు ప్రధాన రహదారిని ఆక్రమిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నట్టు అని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు నిమ్మకు నేరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. 'రాజు' నిర్లక్ష్యంగా ఉంటే 'మాఫియా' రాజ్యమేలుతుంది అన్న చందంగా ఉంది. దానికి బలయ్యేది సామాన్య ప్రజలే. వంశీ మరణం దానికి ప్రత్యక్ష ఉదాహరణ.

## మరో 'నేరెళ్ల'గా సాంబాయిగూడెం మారనుందా.?

నేరేళ్ల ఘటన 2017న ఇసుక లారీలను అడ్డుకున్న దళితులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. రాష్ట్రం అట్టుడికిపోయింది. సాంబాయిగూడెం ఇసుక లారీలు రోడ్డును ఆక్రమించి, అంబులెన్స్ ను అడ్డుకుని ఒక నిండు ప్రాణం తీశాయి. దీనికి బాధ్యులు ఎవరు? నేరేళ్లలో బలైంది దళితులు, సాంబాయిగూడెంలో బలయ్యేది గిరిజనులు. దళితులు, బడుగు బలహీన వర్గాల పేదలేనా అంటూ పలు గిరిజన, ఆదివాసి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీనికి దోషులు ఎవరు? నేరేళ్లలో ఇసుక కాంట్రాక్టర్, పోలీసులు అయితే సాంబాయిగూడెంలో ఇసుక బినామీలు, మామూళ్లు తీసుకునే అధికారులు. పేర్లు మారాయి కానీ వ్యవస్థ మారలేదంటూ ప్రజలు వాపోతున్నారు. నేరేళ్లలో నెల రోజులు దాటాక ప్రభుత్వం స్పందించారు. సాంబాయిగూడెంలో వంశీ చనిపోయి 4 రోజులు అవుతున్నా ప్రభుత్వ యంత్రాంగం పాలకులు స్పందించకపోవడం దారుణమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేరేళ్ల తరహాలోనే సాంబాయిగూడెం కూడా ప్రజాగ్రహానికి కేంద్ర బిందువు కాబోతోంది. అధికారులు ఇప్పటికైనా మేల్కొనకపోతే రేపు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పలువురు మేధావులు హెచ్చరిస్తున్నారు.

## ఇసుక బినామీల చేతుల్లో మరెంత మంది బలికానున్నారు?

సాంబాయిగూడెం, రామానుజవరం, విజయనగరం రోడ్డులో రోజూ 3 గంటల ట్రాఫిక్ జామ్. స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, బైకులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఏం జరుగుతుందో ప్రజలు భయాందోళనకు గురౌవుతున్నారు. 24 గంటలూ లారీలు తిరుగుతుంటే గ్రామాల్లో శ్వాసకోశ వ్యాధులు, గుండెపోట్లు పెరుగుతున్నాయి. పిల్లలు, వృద్ధులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇలా ప్రతి క్షణం సాంబాయిగూడెం ప్రజలు మృత్యువుతో సహజీవనం చేస్తున్నారు. ఇంకెంతమంది వంశీలు బలికావాలో అర్థం కాని పరిస్థితిలో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పాలకులు మేల్కొనకపోతే, ప్రజలే మేల్కొనాలి. నేరేళ్లలో ప్రజలు తిరగబడితేనే న్యాయం జరిగింది. సాంబాయిగూడెంలో కూడా అదే జరగాలి. ఇసుక లారీలు రోడ్డును ఆక్రమిస్తే, ప్రజలు రోడ్డెక్కాలి. అధికారులు స్పందించకపోతే వారి కార్యాలయాలు ముట్టడించాలని పలువురు మేధావులు పేర్కొంటున్నారు.



# నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ పాఠశాలలకు అతి సమీపంలో ఉన్న ప్రైవేట్ స్కూళ్లపై తనిఖీలు నిర్వహించాలి
- సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు బానోత్ కిషన్ నాయక్ డిమాండ్



**టేకులపల్లి, జూన్ 25,ప్రజాజ్యోతి:** మండలంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు బానోత్ కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలకు అతి సమీపంలో ప్రైవేట్ పాఠశాలలు నిర్వహించడం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు, మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు లేకుండానే కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి పాఠశాలల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడమే కాకుండా, విద్యా ప్రమాణాలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు నిర్దేశిత దూరంలోనే ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండేలా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలను గుర్తించేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆయన కోరారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పరిరక్షణకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కూడా కోరుతున్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ఇంటింటి ఓటరు సర్వే



**టేకులపల్లి,జూన్ 25, ప్రజాజ్యోతి:** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో గురువారం ఇంటింటి ఓటరు జాబితా సర్వే నిర్వహించారు. ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడంతో పాటు అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మండల పరిధిలోని గంగారం, లచ్చగూడెం, కిష్టారం, చింతోని చెలక గ్రామ పంచాయతీ లలో నిర్వహించిన సర్వేలో కోరం సురేందర్, బీఎల్వో పాయం సమ్మక్క, స్థానిక సర్పంచులు పాల్గొని ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఓటరు జాబితాలో నమోదైన పేర్లు, చిరునామాలు, వయస్సు తదితర వివరాలను ధృవీకరిస్తూ అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే కొత్తగా ఓటరు అర్హత పొందిన యువత తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు మూలస్తంభమని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో తమ వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించుకొని, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే బీఎల్వోలు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఈది గణేష్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు, గ్రామస్థులు పాల్గొని సర్వే నిర్వహణకు సహకరించారు.